తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 6- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 4 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# పాలమూరుకు జలకళ తెస్తాం: సీఎం



- 26 లక్షల ఎకరాలకు వరం
- పెండింగ్ పనుల పూర్తి లక్ష్యం
- రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొత్తూరు, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పచ్చని పంటలతో కళకళలాడే ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలోని సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. గత రెండు రోజులుగా పాలమూరు ప్రాంతంలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, జూరాల, కోయిల్ సాగర్ వంటి కీలక ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వ్యవసాయ రంగం పూర్తిగా రూపాంతరం చెందుతుం



దని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం జరిగిందని, భూసేకరణ పూర్తి చేయకుండా పంపులు, లిఫ్టులు, ఇతర పనులపై భారీగా నిధులు ఖర్చు చేశారని విమర్శించారు. దీంతో అనేక ప్రాజెక్టులు మధ్యలోనే నిలిచిపోయాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి

మిగతా 2లో

"ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతులకు అవసరమైతే మార్కెట్ ధర కంటే అధిక పరిహారం చెల్లించి భూసేకరణ పూర్తి చేసి, వచ్చే రెండేళ్లలో ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు."



# అమీర్‌పేట్ అగ్నిప్రమాదంపై కవిత ఆగ్రహం

- బాధితులను పరామర్శించిన కవిత
- అధికారుల నిర్లక్ష్యమే కారణం
- నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు): అమీర్‌పేట్‌లోని మైత్రివనం ఎదురుగా ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత సందర్శించారు. ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు తమకు గత కొంతకాలంగా ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవితకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కల్వకుంట్ల కవిత, ఈ అగ్నిప్రమాదం అనూహ్యంగా జరిగిన ఘటన కాదని అన్నారు. భవనం వెనుక భాగంలో ఉన్న మెస్ కారణంగా గతంలో కూడా షార్ట్‌సర్క్యూట్ ఘటనలు జరిగినట్లు బాధితులు తెలిపారని చెప్పారు. అగ్నిప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయని మూడు నెలలుగా సంబంధిత అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని కవిత విమర్శించారు. ప్రమాదం వల్ల సుమారు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాపారుల జీవితాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక వాహనాలు గంటకు పైగా ఆలస్యంగా చేరుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆమె అన్నారు. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఉంటే

మిగతా 2లో

# పేదల కోసం లక్ష ఇళ్లు

- ప్రభుత్వ భూముల్లో నిర్మాణం
- మహిళలకు యాజమాన్య హక్కులు
- జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రణాళిక

హైదరాబాద్, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు): కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పేదల గృహ నిర్మాణం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఈ ఇళ్ల స్థలాల్లో మహిళలకు యాజమాన్య హక్కులు కల్పించి వారి ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారు ప్రస్తుతం

మిగతా 2లో



# పర్యావరణ దినోత్సవ వేడుకలు

- డీర్ పార్క్‌లో మొక్కల నాటకం
- ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం
- పచ్చదనానికి సామూహిక సంకల్పం
- మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని డీర్ పార్క్‌లో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ

మిగతా 2లో



# రూ.30 వేల కోట్ల భూమికి రక్షణ

- పుప్పాలగూడలో హైడ్రా చర్యలు
- రెండువందల ఎకరాలకు ఫెన్సింగ్
- చారిత్రక రాతిగుట్టల పరిరక్షణ



**హైదరాబాద్, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా చేపట్టిన భారీ ఆపరేషన్‌లో రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దులోని సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించింది. సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణల నుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతంలో ఉన్న అరుదైన చారిత్రక రాతిగుట్టలు, పురాతన రాతి నిర్మాణాలు, సహజ వనరుల పరిరక్షణకు ఈ చర్యలు కీలకంగా మారాయి. హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించిన భూముల్లో ఆక్రమణలకు అవకాశం లేకుండా సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ పనులు చేపట్టారు. దశాబ్దాలుగా

మిగతా 2లో

# కామారెడ్డి జిల్లాలో విషాదం

- తల్లి ఇద్దరు కుమార్తెల మృతి
- పుణ్యస్నానం ప్రాణాలు తీసింది



2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పాలమూరుకు జలకళ తెస్తాం: సీఎం

(మొదటి పేజీ తరువాయి)




ప్రాజెక్టులకు కొత్త ఊపు వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపులతో పాటు కొత్తగా ప్రాజెక్టుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో గణనీయమైన నిధులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులకే కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల పూర్తి కోసం ఇంకా సుమారు నాలుగు వేల ఎకరాల భూసేకరణ అవసరమని ముఖ్యమంత్రి వివరించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించి భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే రైతులు కోరుతున్న ధర కంటే అధికంగా చెల్లించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందని, దానిని త్వరగా అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టుల పనులను గరిష్ట స్థాయిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పంప్ హౌస్‌లు, లిఫ్టులు, కాలువలు, రిజర్వాయర్ల నిర్మాణాలను దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి ప్రతి ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి పథకంలో మిగిలిన అడ్డంకులను ఒక్కొక్కటిగా తొలగిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

తెలంగాణకు కేటాయించిన గోదావరి, కృష్ణా జలాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతి చుక్క నీటిని సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గోదావరి జలాల్లో తెలంగాణకు కేటాయించిన వాటాను పూర్తిగా సాధించడంతో పాటు కృష్ణా జలాల సమస్యల పరిష్కారం కోసం కూడా చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. పాలమూరు అభివృద్ధి రాజకీయాలకు అతీతమైన అంశమని, జిల్లాను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## అమీర్‌పేట్ అగ్నిప్రమాదంపై కవిత ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

నష్టం చాలా వరకు తగ్గించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ్రమాదానికి గురైన దుకాణాల యజమానుల వద్ద అన్ని అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాలు ఉన్నాయని కవిత తెలిపారు. నష్టపోయిన వ్యాపారులకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. అధికార యంత్రాంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది వేసవిలో అగ్నిప్రమాదాలు నివారించేందుకు కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ మరింత అప్రమత్తత అవసరమని కవిత పేర్కొన్నారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదని, అయితే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నగరంలోని వాణిజ్య సముదాయాలు, భారీ భవనాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.






## పర్యావరణ దినోత్సవ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే చెట్ల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, రవాణా శాఖ సభ్యుడు పడాల రాహుల్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి క్షితిజ తదితరులు పాల్గొన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును తెలియజేశారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా అటవీ అధికారి సత్యనారాయణతో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పచ్చదనం పెంపు ద్వారా నగరాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు.

పర్యావరణ సమతుల్యత కోసం చెట్ల పెంపకం అత్యంత అవసరమని వక్తలు పేర్కొన్నారు. చెట్లు గాలి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం పచ్చదన పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచేలా సాగింది. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు సూచించారు.

## పేదల కోసం లక్ష ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)




నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పాదాయ, మధ్యతరగతి వర్గాల కోసం లక్ష ఇళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. 202627 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో రెండున్నర లక్షల ఇళ్లు కలిపి మొత్తం మూడున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే పరిపాలన అనుమతులు మంజూరైనట్లు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో నగరానికి చాలా దూర ప్రాంతాల్లో గృహాలు నిర్మించడం వల్ల పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే కుటుంబాలు దూర ప్రాంతాలకు వెళ్లలేకపోయాయని పేర్కొన్నారు. ఫలితంగా అనేక గృహాలు ఖాళీగా, వినియోగం లేకుండా మిగిలిపోయాయని అన్నారు. ఈ తరహా పరిస్థితులు పునరావృతం కాకుండా పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవనం సాగించేలా గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ వారికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

ముఖ్యంగా మహిళలకు సొంత ఇంటిపై హక్కు కల్పించడం ద్వారా కుటుంబాల్లో భద్రత, స్థిరత్వం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మహిళ సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, భవిష్యత్ తరాల సంక్షేమానికి సొంత ఇల్లు బలమైన పునాదిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇళ్ల స్థలాల్లో మహిళలకు వాటా కల్పించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. పేదల అవసరాలకు అనుగుణంగా ఇళ్ల నమూనాలను రూపొందించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో విషాదం




**కామారెడ్డి, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** కామారెడ్డి జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమార్తెలు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన బాన్సువాడ మండల పరిధిలోని బుడిమి సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బుడిమి సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమీపంలో ప్రవహిస్తున్న మంజీరా నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగారు.

అయితే నదిలో నీటి లోతు ఎక్కువగా ఉండటంతో పాటు ప్రవాహం కూడా బలంగా ఉండటంతో వారు అదుపుతప్పి గల్లంతయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. నీటిలో కొట్టుకుపోతున్న వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో భాను ప్రసాద్ అనే వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. అయితే అనిత (40), ఆమె కుమార్తెలు పావని (14), శివాని (13) నీటిలో మునిగిపోయారు. స్థానికులు ఎంత ప్రయత్నించినా వారిని కాపాడలేకపోయారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో నదిలో గాలింపు నిర్వహించి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమార్తెలు మృతి చెందడంతో మంగళ్ కిష్టాపూర్ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు హృదయాలను కలిచివేశాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నదులు, చెరువుల్లో స్నానాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# రూ.30 వేల కోట్ల భూమికి రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతంలోని రాతిగుట్టల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న పర్యావరణ సంస్థల విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లలో మొత్తం 293 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, వివిధ కేటాయింపులు, భూ వివాదాల అనంతరం సుమారు 200 ఎకరాల భూమి హెచ్‌ఎండీఏ పరిధిలో మిగిలింది. ఈ భూమిలోనే విలువైన చారిత్రక రాతిగుట్టలు, సహజ శిలా నిర్మాణాలు ఉన్నాయి. వీటిని ఆక్రమణల నుంచి రక్షించేందుకు హైడ్రా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతంలోని రాతిగుట్టలకు సుమారు 250 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ శిలా నిర్మాణాలు హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో అరుదైన భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు చారిత్రక వారసత్వాన్ని కాపాడడంలో ఈ చర్యలు కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాతిగుట్టల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న పర్యావరణ సంస్థల ప్రతినిధులు హైడ్రా చర్యలను స్వాగతించారు. సహజసిద్ధమైన కొండలు, రాతి నిర్మాణాలు, పచ్చదనాన్ని కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు విలువైన ప్రకృతి సంపదను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఈ రాతిగుట్టల సమీపంలోని భగీరథమ్మ చెరువు పునరుద్ధరణ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఎత్తైన కొండలు, సహజసిద్ధమైన రాతిగుట్టలు, చెరువు కలిసిన ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి సంపద, ప్రభుత్వ భూముల పరిరక్షణలో హైడ్రా చేపట్టిన ఈ చర్యలు విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

శనివారం - 6 - జూన్ 2026



# వైయస్సార్ నగర్ లోని గుడిసెలను కబ్జా చేయాలని చూస్తున్నారు



**కాజీపేట్ జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆరోపణలు కాజీపేట మండల కేంద్రం లోని వైఎస్ఆర్ నగర్‌లోని పేద ప్రజల గుడిసెలను అక్రమంగా ఖాళీ చేపించి ప్రభుత్వ భూమిని కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాజీపేట్ లోని మీడియా పాయింట్లులో శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగరావు నార్లగిరి రమేష్ శివకుమార్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ, కాజీపేట లోని వైఎస్ఆర్ నగర్ లో 9 ఎకరాల ప్రభుత్వ భూమి మార్కెట్ విలువ సుమారు 300 కోట్లుల విలువ ఉంటుందని పేదల గుడిసెల నుంచి ఖాళీ చేయించి కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్ పేదలను బెదిరిస్తున్నారని గుడిసెలను ఖాళీ చేయించేందుకు రూ 40 కోట్ల డీల్ మాట్లాడుతున్నారని ప్రచారం జరుగుతోందని వారు తెలిపారు. ఈ భూమిని పేదలకు పట్టాలు ఇచ్చి పక్కా ఇండ్లు నిర్మించాలని, ఐటీఐ, జూనియర్ కాలేజీ, ఆసుపత్రి, ఏసీపీ కార్యాలయం, బస్టాండ్, చిరు వ్యాపారుల సముదాయాలు వంటి ప్రజా ఉపయోగ భవనాలు నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు. 1982 నుంచి ఈ భూమిని ప్రజా ఉద్యమాల ద్వారా కాపాడినట్లు, గతంలో టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేదలకు కేటాయించినట్లు వారు గుర్తు చేశారు. ఈ విషయంపై హైకోర్టులో LGC/6/1993 రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉందని, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ భూమి విషయంలో తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటాపూర్ రాజు, మర్యాల కృష్ణ, దువ్వ కనకరాజు, రంజిత్, తేలు సారంగపాణి , బసవ యాదిగిరి, బండి రామచందర్, గబ్బెట శ్రీనివాస్, దశరథం, కొండ్ర శంకర్, మహమూద్, రాజ్ కుమార్, కిట్టు, కుమార్ లు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు పర్యటనలో రేవంత్ పచ్చి అబద్ధాలు

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**మహబూబ్‌నగర్,జూన్05(తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన సీఎం ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో బీఆర్ఎస్ హయాంలో రూ.35,200 కోట్ల విలువైన పనులు జరిగాయని, ప్రాజెక్టుపై కాంగ్రెస్ గతంలో పలు కేసులు వేసి అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు.రూ.27 వేల కోట్ల ఖర్చు జరిగిన విషయాన్ని సీఎం స్వయంగా అంగీకరించారని గుర్తు చేశారు. ప్రాజెక్టు కోసం అవసరమైన 27,100 ఎకరాల భూసేకరణలో 26,800 ఎకరాలు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, భూసేకరణ జరగలేదని చెప్పడం సరికాదన్నారు. ఎత్తిపోతల పథకాలలో ముందుగా పంపులు, లిఫ్టుల నిర్మాణమే చేపట్టాల్సి ఉంటుందని, వాటిపై సీఎం చేసిన వ్యాఖ్యలు అవగాహన రాహిత్యాన్ని సూచిస్తున్నాయని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాల్వల టెండర్లు రద్దు చేయడం వల్ల ప్రాజెక్టుపై అదనంగా రూ.4 వేల కోట్ల భారం పడిందన్నారు.దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసి పాలమూరులో సాగునీటి విస్తరణకు కృషి చేసిందని తెలిపారు.గత 30 నెలల్లో ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన నిరంజన్ రెడ్డి, పాలమూరు పర్యటనలో సీఎం వాస్తవాల కంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపిన అంశంపై సీఎం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రైతులకు త్వరగా నీరు అందేలా మిగిలిన పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రత్యేక నియామకాలకు శ్రీకారం



**ఎల్కతుర్తి, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడం, ప్రత్యేక తరగతులను సమర్థవంతంగా నిర్వహించడం లక్ష్యంగా ఎల్కతుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక నియామకాలకు శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని బీసీ కాలనీ ఎల్కతుర్తి, దండేపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు (బోధకులు), ఆయాలు (వాలంటీర్లు) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి చదువుల సత్యనారాయణ తెలిపారు.

జూన్ 8 నుంచి నిర్వహించనున్న ప్రత్యేక తరగతుల కోసం ఈ నియామకాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు అభ్యాసంలో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్మీడియట్, డి.ఎడ్., బి.ఎడ్. అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపికైన వారికి విద్యార్థులకు బోధనా సహకారం అందించే బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.8 వేల వరకు గౌరవ వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆయా (వాలంటీర్) పోస్టులకు ఏడవ తరగతి విద్యార్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపికైన వారికి నెలకు రూ.6 వేల పారితోషికం చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఆయా పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలతో మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89851 67927, 94400 51218 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తును మరింత మెరుగుపరిచే దిశగా ఈ ప్రత్యేక నియామకాలు ఉపయోగపడతాయని మండల విద్యాశాఖ అధికారి చదువుల సత్యనారాయణ పేర్కొన్నారు.

# పర్యావరణ దినోత్సవం వేడుకలు.. హుజూరాబాద్‌లో హరితహారం సందడి





**హుజూరాబాద్, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూరాబాద్ పట్టణంలో పలు ప్రాంతాల్లో మొక్కల నాటే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు.



హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు, మున్సిపల్ కమిషనర్ కిషన్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాతావరణ మార్పులు మరియు కాలుష్య సమస్యలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా బోర్నపల్లి 14వ వార్డులో బీజేపీ నాయకుడు గంట సంపత్ తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. "ఒక మొక్క - ఒక జీవం, ఒక చెట్టు - ఒక భవిష్యత్" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకమని పేర్కొన్నారు.

మరోవైపు హుజూరాబాద్ పట్టణంలోని బుడిగ జంగం కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో అంగన్‌వాడీ టీచర్ కాటోజి జ్యోతి రాణి ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హుజూరాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, ఓరెడ్డి శాంతన్ రెడ్డి, కాలనీ వాసులు, అంగన్‌వాడీ పిల్లలు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు వార్డులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థల ఆధ్వర్యంలో కూడా మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు హుజూరాబాద్‌లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు పట్టణాన్ని మరింత హరితమయం చేసే దిశగా ముందడుగుగా నిలిచాయి. పచ్చదన పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

# జమ్మికుంటలో బీఎస్పీ శక్తి ప్రదర్శనకు సన్నాహాలు

- జూన్ 7న సామాజిక పరివర్తన సదస్సు.



**జమ్మికుంట టౌన్ జూన్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో జూన్ 7వ తేదీ ఆదివారం నిర్వహించనున్న సామాజిక పరివర్తన సదస్సుకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్ ముఖ్య అతిథిగా, బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ విశిష్ట అతిథిగా హాజరు కానున్నట్లు హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మంద సమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్యాడర్ క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉదయం టీ, టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం భోజన వసతి కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హుజురాబాద్, కమలాపూర్, వీణవంక, ఇల్లంతకుంట, జమ్మికుంట మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి దొడ్డె సమ్మయ్య, సీనియర్ నాయకులు మారపల్లి మొగిలయ్య, అసెంబ్లీ ఇన్‌చార్జి వేల్పుల మల్లేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), సీనియర్ నాయకుడు ఇదునూరి రమేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, అసెంబ్లీ కార్యదర్శి గరిగె చంద్రయ్య పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయుల బడిబాట ఉద్యమం




**ఎల్కతుర్తి , జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఎల్కతుర్తి మండలంలోని ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని బావుపేట, తిమ్మాపూర్, ఎల్కతుర్తి, దామెర, దండేపల్లి, కేశవాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. మనోహర్ నాయక్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా ఉండేందుకు బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం, విశాలమైన ఆటస్థలాలు, ఆధునిక బోధనా పద్ధతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు కూడా ప్రత్యేక సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యావంతులు, మేధావులు, తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శ్రీధర్, సుధాకర్, జ్యోతి, ముకుంద్ రెడ్డి, సీఆర్పీ మర్రి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి!



- ప్రజలకు ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి సూచన




**సత్తుపల్లి, జూన్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో రాత్రి వేళల్లో ఇంటి దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండల కారణంగా పలువురు ఇంటి బయట వరండాల్లో నిద్రిస్తున్న నేపథ్యంలో ఇంటి తలుపులకు తప్పనిసరిగా తాళాలు వేయాలని సూచించారు. ప్రధాన ద్వారం, వెనుక ద్వారం, అల్మారాలకు తాళాలు సరిగా ఉన్నాయో లేదో ప్రతి రోజూ పరిశీలించుకోవాలని తెలిపారు. బంగారం, నగదు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచడం మంచిదని పేర్కొన్నారు. ఇంటి బయట, మెట్ల వద్ద, పెరట్లో రాత్రి వేళల్లో లైట్లు వెలిగించి ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్-100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సాధ్యమైనంత వరకు ప్రతి ఇంటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి తెలిపారు. బీట్ పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బందితో గ్రామాలు, కాలనీల్లో నిఘా పెంచినట్లు చెప్పారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా బేతుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్తుపల్లి ఎస్ఐ అశోక్ కుమార్ ప్రజలు దొంగతనాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డ రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు), గ్రామ సెక్రటరీ, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## 'పెద్ది' విడుదల వేళ మానవత్వం చాటిన రామ్ చరణ్ అభిమానులు



- నిరుపేద కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం

**అలంపూర్,జూన్05(తెలంగాణ ముచ్చట్లు):** రామ్ చరణ్ నటించిన "పెద్ది" చిత్రం విడుదల సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు సూచనల మేరకు జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా చిరంజీవి యువత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. రాజోలి మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రామ్ చరణ్ అభిమానులు స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ నిషాక్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో అభిమానులు ముందుండటం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా సమాజానికి సామాజిక బాధ్యతను చాటడమే కాకుండా, అవసరంలో ఉన్న కుటుంబాలకు అభిమానుల సహకారం ఎంతో సానుకూల మార్పును తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలే మార్గం



- మనిగిల్ల సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

**పెద్దమందడి,జూన్05తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దమందడి మండలంలోని మనిగిల్ల గ్రామంలో గురువారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ పల్లె ప్రగతి పార్కులో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు, గ్రామ కార్యదర్శి వెంకటేష్‌తో కలిసి పలు రకాల మొక్కలను నాటారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.గ్రామ మహిళలు ఉత్సాహంగా పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

## రుద్రభూమిలో నాలుగు గదుల నిర్మాణానికి భూమిపూజ





- రూ.1 లక్ష విరాళం ప్రకటించిన చైర్మన్ దిలీప్

**జమ్మికుంట టౌన్ జూన్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని ఆబాది జమ్మికుంట రోడ్డులో ఉన్న హిందూ రుద్రభూమి (స్మశాన వాటిక)లో దహన సంస్కారాలు నిర్వహించుకునే ప్రజల సౌకర్యార్థం నాలుగు గదుల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో వైశ్యుల స్మశాన వాటికగా ఉన్న ఈ రుద్రభూమిని పట్టణ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకువచ్చిన వైశ్య పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పెరుగుతున్న జనాభా, మారుతున్న సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికలో మరిన్ని సౌకర్యాలు కల్పించడం అవసరమైందన్నారు.

ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి జమ్మికుంటకు వచ్చి అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు, తమ కుటుంబ సభ్యుల మరణం సంభవించినప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలు అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలను గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు ఈ గదులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

ఈ గదుల నిర్మాణానికి వైశ్య పెద్దలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్న చైర్మన్, విదేశాల్లో స్థిరపడిన జమ్మికుంట వాసులు, స్థానిక దాతలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మున్సిపల్ పక్షాన తాను వ్యక్తిగతంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు, వైశ్య సంఘ పెద్దలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి





- జిల్లా విద్యాశాఖ అధికారులకు టీజేఎఫ్ జర్నలిస్టుల బృందం వినతి

**ఖమ్మం బ్యూరో,జూన్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవిలు డి ఈ ఓ, డిఐఈ ఓ జిల్లా విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్, వెబ్, కేబుల్, డెస్క్, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ ల తో పాటు వివిధ విభాగాలలో వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయం సూపర్డెంట్ నాగజ్యోతి లకు వారి కార్యాలయాలలో శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే జర్నలిస్టులు ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తూ ఉంటారని, వారి పిల్లలకు ప్రవేట్, ఎయిడేడ్, పాఠశాలలు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. గత అనేక సంవత్సరాలుగా జర్నలిస్టు పిల్లలకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ సర్క్యులర్ జారి చేసే వారిని దీని ఫలితంగా అనేక మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరిందని, 2026 27 విద్యా సంవత్సరానికి కూడా ఇటు డిఇఓ, అటు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి సర్కులర్లను విడుదల చేసి జర్నలిస్టు పిల్లలను ఆదుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టిజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వనం నాగయ్య, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యాలమందల జగదీష్, నగర ప్రధాన కార్యదర్శి అమరపు కోటేశ్వరరావు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్‌బాబు, కోశాధికారి బిక్కి గోపి ఉపాధ్యక్షులు, ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ సెక్రెటరీ ఎస్. వెంకటేశ్వర రెడ్డి, సహాయ మూల జీవన్ రెడ్డి, మురళి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, సంతోష్, యాదగిరి, నాగశేఖర్ ,రవీందర్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్ , పాశం వెంకటేశ్వర్లు, కళ్యాణ్ , సాయి, లింగయ్య, గౌరీ శంకర్ ,రాంబాబు, శ్రీనివాస్, సీతారాములు, సంజీవరెడ్డి, నరసయ్య, రామ్ ఎస్ వి రెడ్డి, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి

- టీఏసీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి




**ఖమ్మం బ్యూరో, జూన్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తన సేవలను మరింత వేగవంతం చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

సేవల్లో నాణ్యత పెరగాలి..

ఈ సందర్భంగా మాట్లాడుతూ...మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన బాధ్యత. బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్‌వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, యాసా వెంకటేశ్వర్లు, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్ నాయక్, కనకరాజు, మచ్చా రామారావు, రామ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా శ్రీ లక్ష్మి వైకుంఠ నారాయణస్వామి కల్యాణ లగ్నపత్రిక కార్యక్రమం

**రాజోలి,జూన్05(తెలంగాణ ముచ్చట్లు):** రాజోలి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి వైకుంఠ నారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవానికి సంబంధించిన లగ్నపత్రిక కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య పురోహితులు, ఆలయ అర్చకుడు గోపి లగ్నపత్రికను ఖరారు చేశారు.ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, ఉపసర్పంచ్ సంధ్య, కాంగ్రెస్ నాయకుడు దస్తగిరి, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.లగ్నపత్రిక కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రానున్న కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.







# ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం

- **జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే జారె.**

